క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, నాయకులు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 91 మందికి సొంత నిధులు రూ.25వేలతో స్టడీ మెటీరియల్‌ను ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, ఆసరా స్వచ్ఛంద సేవా సంఘం అధ్యక్షుడు రెడ్డిపల్లి జగదీష్ బాబు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.శంకరరావు, ఉపాధ్యాయులు చిరంజీవి, అప్పారావు, రవి పాల్గొన్నారు.

శ్మశానం నుంచి వస్తున్న వారిపై దాడి

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణా కళాశాల కూడలి వద్ద మంగళవారం రాత్రి సరగడ శివారెడ్డి అనే వ్యక్తి శ్మశానవాటిక నుంచి ఇంటికి వస్తున్న కాకి పెద సన్యాసిరెడ్డి, కాకి ఎల్లాజీ అనే వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... సంతపేటలో సోమవారం చనిపోయిన వ్యక్తికి చిన్నదినం నిర్వహించి శ్మశానవాటిక నుంచి వస్తున్న వారు కత్తి నేలపై వేసి దాటుతుండగా... అక్కడే ఉన్న శివారెడ్డి వారితో వాగ్వాదానికి దిగి గాయపరిచాడు. అనంతరం తనపై కూడా దాడి చేశారని శివారెడ్డి భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిపోయాడు. ప్రస్తుతం భీమిలి పోలీసులు ఫిర్యాదులు పరిశీలిస్తున్నారు.

సాంకేతిక ప్రగతితోపాటు దేశ రక్షణ కీలకం



కేంద్రీయ పరిశోధన శాలను ప్రారంభిస్తున్న అణుశాస్త్రవేత్త చిదంబరం తదితరులు

కొమ్మాది: దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పథం వైపు నడిపించడంతోపాటు దేశ రక్షణకు సంబంధించిన అంశాలు కూడా కీలకమని బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం అనుబంధ హోమీబాబా చెయిర్ ప్రొఫెసర్, అణుశాస్త్రవేత్త డాక్టర్ ఆర్.చిదంబరం పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రూ.45 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన మూర్తి కేంద్రీయ పరిశోధన శాలను మంగళవారం ఆయన ప్రారంభించి జాతీయ సైన్స్ దినోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ భద్రత, జాతీయ అభివృద్ధి అనేవి ఒకే నాణేనికి రెండు వైపులా ఉండే అంశాలని పేర్కొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ

తగరపువలస: భీమిలి వుడా మినీ స్టేడియంలో మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు కోచ్ కర్రి చిట్టిబాబు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 70758 12423లో సంప్రదించాలని కోరారు.

ప్రణాళికతో చదివితే ప్రయోజనం



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న లజపతిరాయ్

భీమునిపట్నం: విద్యార్థులు ప్రణాళికతో చదువుకుంటే ఆందోళన, ఇబ్బంది ఉండదని, ప్రయోజనకరంగా ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ మాజీ వీసీ డాక్టర్ హెచ్.లజపతిరాయ్ అన్నారు. స్థానిక కెడార్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసే విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. ముందు నుంచే పాఠాలు బాగా అర్థం చేసుకుని ఎప్పటికప్పుడు చదువుకోవాలని సూచించారు. దీనివల్ల ఒత్తిడి లేకుండా ఉంటుందని, జ్ఞాపక శక్తి కూడా పెరుగుతుందన్నారు. ముందు సరిగ్గా చదవకుండా పరీక్షల సమయంలో హడావిడిగా చదివితే అర్థం కావన్నారు. ముందు నుంచే ప్రణాళికతో చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. అనంతరం విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు అందించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు దాటాలంటే భయం భయం..!

- మధురవాడ జంక్షన్‌లో బెంబేలెత్తుతున్న స్థానికులు
- హైవేపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్



జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాల్సింది ఇక్కడే



ప్రమాదకర స్థితిలో రోడ్డు దాటుతున్న చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు

మధురవాడ: నగరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో మధురవాడ ఒకటి. ఈ జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడే వారపు సంత, డైలీ మార్కెట్, 4 వేల మంది విద్యార్థులు, 100 మంది సిబ్బంది ఉన్న చంద్రంపాలెం హైస్కూల్ ఉన్నాయి. వాటితోపాటు జీవీఎంసీ జోన్ - 1 కార్యాలయం, ఆర్‌జేడీ విద్యాశాఖ, ఆయుష్ కార్యాలయాలు, ఇతర ఆస్పత్రులు, విశాఖ జోన్ - 3 విద్యుత్ శాఖ కార్యాలయం, హాస్టళ్లు, దేవాలయాలతో మరిన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆఫీసులు ఇక్కడే ఉన్నాయి. దీంతో రోజూ వేలాది మంది జాతీయ రహదారిని ఇటు నుంచి అటు... అటు నుంచి ఇటు దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో హైవేపై వేగంగా దూసుకొచ్చే వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఇక్కడ రోడ్డు దాటడం పెద్ద పరీక్షలా మారింది.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోనే పరిష్కారం

వేలాది మంది విద్యార్థులు, ప్రజల భద్రత దృష్ట్యా ఇక్కడి జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంవత్సరాలుగా కోరుతున్నారు. ఇక్కడ రోడ్డు దాటలేకే పిల్లలను పాఠశాలలకు, హాస్టళ్లకు పంపించడానికి చాలా మంది తల్లిదండ్రులు వెనుకాడుతున్నారు. గతంలో పోలీసు, ఇతర అధికారుల బృందం ట్రాఫిక్, ఇతర సమస్యలపై అధ్యయనం చేశారు. ఆ సమయంలో ఇక్కడ రోడ్డు దాటడం ఇబ్బందికరంగా మారిందని అందరూ ముక్తకంఠంతో చెప్పారు. దీంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. తర్వాత ఆ విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించడం ద్వారా ప్రమాదాలు నివారించడంతోపాటు ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం భయపడుతున్నాం



పాఠశాల ఎదురుగా జాతీయ రహదారిపై తరచూ ఏవో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో మాతోపాటు తల్లిదండ్రులు కూడా భయపడుతున్నారు. రోడ్డు దాటలేక అప్ బ్రిడ్జి కింది నుంచి ఆటో దిగి నడుచుకుని వస్తున్నాం.

– జ్యోత్స్న, 8వ తరగతి విద్యార్థిని, వుడా కాలనీ

అందరికీ ఇబ్బంది



గతంలో మా పాఠశాలలో ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రతపై చాలా మంది అధికారులు, పెద్దలు సమావేశాలు నిర్వహించారు. అప్పట్లో మా స్కూలు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరాం. నిర్మిస్తామని చెప్పినప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు.

– రాహుల్, 10వ తరగతి, చంద్రంపాలెం హైస్కూల్

బడి మానేస్తున్నారు



జాతీయ రహదారిని దాటేందుకు భయపడి రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం హైస్కూల్‌కు చాలా మంది విద్యార్థులు రావడం మానేస్తున్నారు. ఇటీవల పది మంది హాస్టల్ విద్యార్థులను తల్లిదండ్రులు స్కూల్ మాన్పించేశారు.

– రోహిత్, 9వ తరగతి, చంద్రంపాలెం హైస్కూల్

ఉత్సాహంగా జాతీయ సైన్స్ దినోత్సవం



చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో నమూనాలతో విద్యార్థినులు



రాయపాలెం హైస్కూల్‌లో బహుమతులు అందిస్తున్న నాయకులు



నెహ్రూ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ తిలకిస్తున్న జెడ్సీ రాము



చంద్రంపాలెం హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ నమూనాలు

తగరపువలస: భారతదేశానికి చెందిన భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్'ను కనిపెట్టిన సందర్భంగా ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్టు భీమిలి ఎంఈవో కేపీ బాలామణి తెలిపారు. బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఆమె విద్యార్థుల సైన్స్ నమూనాలను మంగళవారం పరిశీలించారు. 1930లో సీవీ రామన్‌కు నోబెల్ బహుమతి వచ్చిందని, 1954లో కేంద్ర ప్రభుత్వం ఆయనను భారతరత్నతో సత్కరించినట్టు గుర్తు చేశారు. చిట్టివలస శ్రీరామకృష్ణ విద్యాలయంలో సైన్స్ ప్రదర్శనను రాష్ట్ర శిష్టకరణాల సంఘం మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి ప్రారంభించి రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. చిట్టివలస బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ రోజామణి ఆధ్వర్యంలో సైన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ లీలావతి రూపొందించిన బజ్ అలారం ఆకట్టుకుంది. రాయపాలెం జీవీఎంసీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో సైన్స్ ప్రదర్శన నిర్వహించగా వైఎస్సార్‌సీపీ నాయకులు బహుమతులు అందించారు.

పద్మనాభం: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం సైన్సు డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెడ్డిపల్లి, పద్మనాభం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయం, కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్డు హెచ్‌ఎం బస్వా అచ్చిబాబు సైన్సు - మూఢ నమ్మకాలపై మ్యాజిక్ ప్రదర్శన చేసి విద్యార్థులను అకట్టుకున్నారు.

భీమునిపట్నం: నెహ్రూ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి వాటిల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు రూపొందించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైంటిస్ట్ శరత్ చంద్ర పాల్గొని విద్యార్థులను రోబోటిక్స్ రంగం ఉపయోగాలను వివరించారు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొన్నారు. జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు మాట్లాడుతూ సైన్స్ ఆవశ్యకత, ప్రయోజనాలు వివరించారు. కీతిన్‌పేట సన్ స్కూల్‌లో డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో విద్యార్థులు పలు అంశాలపై తయారు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి.

మధురవాడ: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్లు మంగళవారం నిర్వహించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బక్కన్నపాలెం రోడ్డులోని మధురవాడ శ్రీచైతన్య స్కూల్‌లో ఎగ్జిబిషన్లు ఆకట్టుకున్నాయి. చంద్రంపాలెం హైస్కూల్‌లో సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు 147 నమూనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎమ్.రాజబాబు, ఎ.జయప్రద, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బుదుమూరి మీనా పాల్గొన్నారు. శ్రీ చైతన్య స్కూల్‌లో స్టేట్ అకడమిక్ కో ఆర్డినేటర్ కౌశల్, ఎంపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

15వ నంబరు రేషన్ డిపోకు తాళాలు



తాళం వేసి ఉన్న 15వ నంబరు డిపో వద్ద సీఎస్‌డీటీ కృష్ణారావు

తగరపువలస: స్థానిక 15వ నంబరు రేషన్ డిపోకు మంగళవారం తాళాలు పడ్డాయి. డిపో నిర్వాహకుడు ఉప్పల చిన వెంకటరమణ, అతని కుమారుడు రమేష్‌కు డిపో నిర్వహిస్తున్న భవనానికి సంబంధించిన హక్కులపై తగాదాలు న్యాయస్థానంలో ఉన్నాయి. అనధికార చిరునామాలో డిపో నిర్వహిస్తున్నట్టు ఇటీవల రమేష్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా తహసీల్దార్ వేణుగోపాల్ ఆదేశంతో సీఎస్‌డీటీ కృష్ణారావు అక్కడకు మంగళవారం వచ్చారు. డిపో తెరిచి చూడగా అందులో సరకులు ఏమీ లేకపోవడంతో చిన వెంకటరమణ తాళాలు వేశారు. వెంటనే ఆ డిపోకు మరో తాళం వేసి ఉండడంతో సీఎస్‌డీటీ వేసినట్టు చిన వెంకటరమణ ఆరోపించారు. కాసేపట్లో రెండో తాళం చెవి వెనక్కు తీసుకొచ్చిన సీఎస్‌డీటీ కృష్ణారావు దాన్ని చిన వెంకటరమణకు అందిస్తూ... తాళం తాను వేయలేదని, మీ కుమారుడు రమేష్ వేశాడని స్పష్టం చేశారు. దీనిపై భీమిలి తహసీల్దార్ వేణుగోపాల్‌ను వివరణ కోరగా అనధికారంగా నిర్వహిస్తున్న డిపో నిర్వహణను రద్దు చేసి మరొకరిని ఇన్‌ఛార్జిగా నియమించనున్నట్టు తెలిపారు. అనధికార డిపోలో సరకులు ఉంటే తీసుకుని ఇన్‌ఛార్జికి అప్పగించమన్నామని, ఆ భవనానికి తాళాలు వేసే అవసరం మాకు లేదన్నారు. కుటుంబ సభ్యుల తగాదాతో తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

వృద్ధురాలు అదృశ్యం



సరస్వతి (ఫైల్)

పద్మనాభం: మండలంలోని రెడిపల్లిలో వృద్ధురాలు అదృశ్యమైంది. ఎస్ ఐ భరత్ కుమార్ రాజు అందించిన వివరాలిలా ఉన్నాయి. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాడపల్లి సరస్వతి (82) సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి కనిపించలేదు. దీనిపై సరస్వతి కుమారుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రజాభిప్రాయం మేరకే క్వారీకి అనుమతి

పద్మనాభం: ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా క్వారీ నిర్వహణకు అనుమతులు మంజూరు చేస్తామని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో సర్వే నంబర్లు 293, 295లో తీగల శేష శైల అనే వ్యక్తి రోడ్డు మెటల్ బిల్డింగ్ స్టోన్ క్వారీ ఏర్పాటు కోసం అనుమతికి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై రెడ్డిపల్లి సచివాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ ప్రజలు వెలుబుచ్చిన అభిప్రాయాలను పరగణనలోకి తీసుకుంటామన్నారు. రెడ్డిపల్లి ఉప సర్పంచ్ సిరుగడి ఆదినారాయణ మాట్లాడుతూ క్వారీ వల్ల సీనరేజ్ గ్రాంటు, సీఎస్ఆర్ గ్రాంటు వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాసరావు, హెచ్‌డీటీ కిశోర్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

సీతంరాజు సుధాకర్ గెలుపుతో మరింత అభివృద్ధి

విస్తృతంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రచారం



మధురవాడ వీ టెక్నో స్కూల్లో ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో ప్రిన్సిపాల్ వర్గిస్‌కి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ప్రచారంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, నాయకులు

మధురవాడ: విశాఖ పరిపాలన రాజధాని కాబోతున్న తరుణంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అంతా సహకరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. జీవీఎంసీ 6, 7, 8 వార్డుల్లోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మధురవాడ వి టెక్నో, వేంకటేశ్వర విద్యా సంస్థలు, మిథిలాపురి వుడా కాలనీలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో ఎయిర్‌పోర్టుతోపాటు కోస్టల్ కారిడార్ రోడ్డులు రానున్నాయనన్నారు. భారీగా పెట్టుబడులు ఆకర్షించేందుకు విశాఖలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ తరుణంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో చంద్రంపాలెం హైస్కూల్ హెచ్‌ఎమ్‌లు ఎమ్.రాజాబాబు, ఎ.జయప్రద, వి.టెక్నో స్కూల్ డైరెక్టర్ యేటూరి వెంకటేష్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ జోబి వర్గిస్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, పోతిన శ్రీనివాసరావు, బొట్ట అప్పలరాజు, సింహాచలం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, కుడితి రామారావు, వాండ్రాసి రవి, రజిని తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌ని గెలిపించాలని ఇంటింట ప్రచారం

ఆనందపురం: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ని గెలిపించాలని కోరుతూ పార్టీ మండల నాయకులు మంగళవారం పెద్దిపాలెం, వెల్లంకి, వేములవలస గ్రామాల్లో ఓటర్ల ఇంటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ విద్యావంతుడైన సీతంరాజు సుధాకర్‌ను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, బంటుబిల్లి మణిశంకర్ నాయుడు, బావిశెట్టి రాజు, ఎం.చిన్నయ్య పాత్రుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, గంద్రెడ్డి శ్రీనివాస్, కె.చంద్రమౌళి, కాకర వెంకట రమణ, పిన్నింటి వెంకటరమణ పాల్గొన్నారు.

కొమ్మాది: ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి ప్రచారం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ఉప్పులూరి గోపి, ఉమా మహేశ్వరరావు, పవన్ పాల్గొన్నారు.

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు కోరుతూ పార్టీ ఒకటో వార్డు నాయకులు మంగళవారం తగరపువలసలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణ పాల్గొన్నారు.

మధురవాడ: వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని జీవీఎంసీ 7వ వార్డులో నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా మంగళవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు కాలనీలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేవారు. చేకూరి రజని, సూర్యనారాయణ, వరలక్ష్మి, కుంటుంబరావు పాల్గొన్నారు.



పెద్దిపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు



తగరపువలసలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



స్వతంత్రనగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

వ్యాయామంతో ఒత్తిడిని జయించవచ్చు



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీ ప్రావీణ్య

ఆనందపురం: రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల మానసిక ఒత్తిడిని జయించవచ్చని స్త్రీ వైద్య నిపుణురాలు లక్ష్మీప్రావీణ్య సూచించారు. మండలంలోని బంటుబిల్లి వారి కళ్లాలు వద్ద ఉన్న ఓ కళాశాలలో మంగళవారం ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం, యునైటెడ్ అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రావీణ్య మాట్లాడుతూ యవ్వన దశలో ఉన్న పిల్లలు ఒత్తిళ్లకు లోనవుతారన్నారు. పిల్లల మైండ్, శరీరంలోని హార్మోన్స్‌ను బ్యాలెన్స్ చేసుకోవాలంటే వ్యాయామం తప్పకుండా చేయాలన్నారు. కౌమార దశ పిల్లల్లో వస్తున్న మార్పుల వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరావు, పచ్చిపులుసు కనకారావు, ఆకుల శ్రీనివాసరావు, కడగళ్ల నారాయణరావు, పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రాజీవ్ గృహకల్పలో కుక్కల బెడద



తగరపువలస: జీవీఎంసీ 5వ వార్డు తిమ్మాపురం రోడ్డులోని గురుకుల పాఠశాల సమీపంలోని రాజీవ్ గృహకల్పకు కుక్కల బెడద ఎక్కువగా ఉంది. నడిచేవారితో పాటు ద్విచక్ర వాహనదారులను ఇక్కడి కుక్కలు వెంటాడి కరుస్తున్నాయి. ఇటీవల పలువురు వీటి బారినపడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. కుక్కల నియంత్రణకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలి.

– రాహుల్ కుమార్, మారికవలస

శ్రీవారిని దర్శించుకున్న అణు శాస్త్రవేత్త

కొమ్మాది: రుషికొండలో గల మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అణు శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.చిదంబరం శ్రీవారిని దర్శించుకున్నారు. అంతరాలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అర్చకులు వేదాశీర్వాదం అందజేశారు. ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ రాజు ప్రసాదం అందజేశారు.